# ఆఫీసరు భార్య

నెలలు నిండిన గర్భవతిలా నిండుగా ఉంది కృష్ణా ఎక్స్‌ప్రెస్. ప్రయాణీకుల తోపిళ్ళూ, రాపిళ్ళు ఒక పక్క ఉండగా, 'చాయ్... కాఫీ'ల నినాదాలూ, 'ఇడ్లీ—ఇడ్లీవడై—సాంబార్' అరుపులు, వచ్చి పోయే ఇతర రైళ్ళ కూతలూ, కూలీల గడబిడా, పళ్ళు, బొమ్మలూ, పుస్తకాలూ వగైరా అమ్మే బళ్ళవాళ్ళు ఎవరు ఎవరితో ఏంమాట్లాడుతున్నారో అర్థంకాని పిచ్చాసుపత్రి సీనులా ఉంది సికింద్రాబాదు రైల్వేస్టేషను

నా బోగీ నెంబరూ, సీటు నెంబరూ వెతుక్కుంటూ ఎలాగో లోపలికెక్కాను. అక్కడ నా సీటులో ఒక లావుపాటావిడ హాయిగా కాళ్ళు జాపుకుని కూర్చుని బత్తాయిపండు ఒలుచుకు తింటూంది.

"క్షమించండి—ఇది నా సీటు" అన్నాను ఎంతో వినయంగా.

నా వేపు చురచురా చూసింది కొరికేసేలా. ఆ తీక్షణ వీక్షణాలకు గుండె దడదడలాడింది ఒక్క క్షణం.

"ఇది నా సీటే" అంది ధీమాగా, బత్తాయితొన నోట్లో పెట్టుకుంటూ.

"కాదు మీరు పొరపాటు పడుతున్నారు. కావాలంటే మీ టిక్కెట్టు చూసుకోండి" అన్నాను నెమ్మదిగా.

"ఇదిగో అమ్మాయ్! పొరపాటూ, గిరపాటూ ఏం లేదు. మా ఆయన ఆఫీసరు నాకువారంటుంది. నువ్వే పొరపాటున ఫస్టుక్లాసుడబ్బాలో కెక్కినట్టున్నావ్. నీ వాలకం చూస్తే అలా గేఉంది" గుక్క తిప్పుకో కుండా దండకం చదివేసింది, మెడ తిరగకుండా అడ్డుకుంటూన్న (బహుశా గుచ్చుకుంటున్నాయేమో) చంద్రహారాలనీ, పలక సర్లనీ, కానీ అంత బిళ్ళలతో రెండు వరసల్లో, మెడకి బిగువుగా ఉన్న నల్లపూసల్ని సర్దుకుంటూ.

ఆవిడ మాటలకి షాక్ కొట్టింది నాకు. 'ఆఫీసరుగారి భార్యగా ఏంటెక్కు చూపెడుతూంది? ఏం ఆఫీసరుబాబూ ఈమె భర్త? ఆఫీసర్ బాబులా మాట్లాడుతూంది ఈమె. ఎందుకో ఆమెని చూస్తున్న కొద్దీ నవ్వొచ్చింది. అంతలోనే నా సీటులోంచి లేవకపోవడం చూసి ఒళ్ళు మండింది కూడా. కానీ, ఆవిడతో ఎలా మాట్లాడాలో తెలీక తికమక పడుతూన్న నాకు— "వారంటేమిటండీ మీరు—" అని ఎవరో ప్రశ్నించడంతో, ఆవిడ అటు తిరిగి "హయ్యో నా మతిమండ. మా అబ్బాయి మిలట్రీ ఆఫీసర్లెం'. వాడు వారంటుమీద వస్తాడుకదూ, అది విని వినీ నోటంటఅదే వచ్చేసింది. మాదీ ప్యాసు"అంది నవ్వుతూ. ఇంతలో ఈ గొడవంతా చూసి, కండక్టర్ అటుకేసి వచ్చాడు. నా టిక్కెట్టునీ,

ఆవిడగారి ప్యాసుచెక్ చేసి, ఆవిడది పక్క సీటని తేల్చేశాడు చేసేది లేక 'ఏధా ఖర్మమా' అంటూ పక్క సీట్లోకి మారింది నావైపు కొరకొరా చూస్తూ

"హమ్మయ్య" అనుకుని నా సీట్లో కూర్చున్నాను వెంటనే రైలు కూత వేసింది. గార్డు పచ్చజెండా ఊపాడు. "బై...బై" అన్నాడు ప్రసాద్. 'బై' అంటూ నా చిన్న సూటుకేసుని పక్కగా పెట్టుకున్నాను. మరచెంబూ, ఫ్లాస్కూ, పళ్ళు ఉన్న బుట్టని కాళ్ళదగ్గరగా పెట్టుకుని, కుడి చేతివైపో సూటుకేసూ. అటకమీద రెండు పెట్టెలూ నక్కి కాళ్ళు జాపుకుని కూర్చుందావిడ రైలు వేగం హెచ్చించి. నేను బ్రీఫ్ కేసులోంచి 'వీక్లీ' తీసి చదువుకుంటున్నాను. ఎవరికి వారు పేపరో, పుస్తకమో తీసుకుని కూర్చున్నారు. ఉన్నట్టుండి "ఇందాక స్టేషన్ కొచ్చినాయన నీకేమవుతాడూ?" అంది ఆవిడ. ఆ ప్రశ్నకి పుస్తకంలోంచి తల ఎత్తి చూశాను. సందేహం లేదు. ఆవిడ ఆ ప్రశ్న నన్నే అడుగుతోంది. ఆవిడ చూపులన్నీ నా వోసి మెడమీదే ఉన్నాయ్. "మా అన్నయ్య" అన్నాను ముక్తసరిగా మళ్ళీ పుస్తకంలోకి మెడ మార్చి.

"ఏమిటో— ఈ రోజుల్లో ఎవరు ఎవరో తెలీడంలేదు" అంది పెదవి విరుస్తూ.

ఆవిడ మాటలకి నాకు ఒళ్ళు మండిపోయింది. ఈడ్చి పుచ్చుకు తన్నాలనిపించింది. కానీ, ఏమీ చెయ్యలేక నోరు మూసుకు కూర్చున్నాను. రెండు లైన్లు చదివానో లేదో, మళ్ళీ ప్రశ్న "నీకింకా పెళ్ళి కాలేదా?" అని.

"లేదు" ఈసారి ముక్తసరిగా తలెత్తి ఆమెకేసి చూడకుండానే సమాధానమిచ్చాను.

'ఎలా అవుతాయిలే. ఆడపిల్ల పెళ్ళంటే మాటలా? బోలెడంత కట్నం కుమ్మరిస్తేకానీ, ఆడపిల్ల ఇల్లుకదలదు. సామాన్య జీతగాడికి శిక్ష ఇద్దరు ఆడపిల్లలు పుడితే చాలు నడుం వంగిపోవలసిందే. జుట్టు నెరిసి పోవలసిందే'. మళ్ళీ దండకం మొదలెట్టింది. ఎవరు విన్నా వినకపోయినా. ఆవిడ ధోరణి మహా చిరాకు పుట్టించింది నాకు. అక్కడ్నుంచి లేచిపోవాలనిపించింది. కానీ ఎక్కడ కూర్చోవాలి? అన్ని సీట్లూ నిండిపోయాయి. చచ్చినట్టు తల వంచుకుని—పుస్తకం అడ్డు పెట్టుకున్నాను. ఆమెను చూడ్డం ఇష్టంలేక.

ఇంతలో "పల్లీ...పల్లీ...పల్లీ!...బఠానీ" అంటూ ఒక కుర్రాడు లోపలికొచ్చాడు.

"ఏయ్ పల్లీ-ఇలారా..." పిలిచింది ఆమె. "ఎలా ఇస్తున్నావ్?"

"పది పైసలు గొట్టం" చిన్న గొట్టాన్ని చూపించాడు వాడు.

'ఇది పది పైసలా? ఐదు పైసలకివ్వు' అంది.

'పడదు' అంటూ తిరిగి వెళ్ళబోయాడు వాడు.

"సరే ఇవ్వు. ఏం చేస్తాం? అందుకే మాములు జీతగాళ్ళు బతకలేక చస్తున్నారు. ఎవరో ఆఫీసర్లుతప్ప...వేలంతలేదు గొట్టం పల్లీలే పది పైసలయితే, తులం బంగారం ఖరీదు వేరేచెప్పాలా? అందుకే ఈ రోజుల్లో అందరూ ఫాషన్లంటూ ప్లాస్టిక్ దుద్దులూ, ప్లాస్టిక్ గాజులూ తగిలించు

డుంటున్నారు. బోసిమెడ మరీ ఫాషనూ..." ఇంత లెక్చరూ ఇచ్చి వాడి చేతిలో పది పైసలూ పెట్టింది. అందరూ ఈవిడ కేసి చూసి నవ్వు కున్నారు.

అందరూ ఆవిడ మాటలు వింటున్నారని మురిసిపోతున్నట్టుందిఆమె గర్వంఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనపడింది. అసహ్యం వేసి నేను తలకిటికీ వైపు తిప్పుకున్నాను. కానీ ఏం లాభం?

"అమ్మాయ్...ఇవిగో తీసుకో" అంటూ కొన్ని బఠాణీలు చేతిలో పుచ్చుకుని పిలవడం మొదలెట్టింది.

నన్ను కాదన్నట్టు నేను తిరిగిచూడలేదు.

"ఏయ్...నిన్నే...నీ పేరేమిటి? ఈ సారి మరీ బిగ్గరగా అంది.

ఇక లాభం లేదనుకుని చెప్పాను-'లావణ్య' అని

"ఏమిటో 'లావణ్య'. 'నాజూకు', 'సుకుమారి' ...నా బొంద. లక్షణంగా 'లక్ష్మి' సరస్వతి', 'పార్వతీ' ఇలా దేముళ్ళ పేర్లు మాను కుని ఫాషన్లంటూ చచ్చు పేర్లుపెట్టుకుంటున్నారు. దేముళ్ళపేర్లు పెట్టుకోడం నామోషి అయిపోయింది. మళ్ళీ ఆ లక్ష్మీదేవి కటాక్షం లేనిదే బతుకు వెళ్ళదు. సరస్వతీ ప్రసన్నంకానిదే ఉండలేరు. నోరారా పిలుచుకోవ డానికీ, తలుచుకోవడానికీ కూడా లేకుండా కొత్త కొత్తగా ఈ వెధవ పేర్లు..." మళ్ళీ వల్లించింది దండకం.

ఈసారి నాకు నిజంగా ఏడుపొచ్చేసింది నాపేరుమీద ఈవిడ చేసిన వ్యాఖ్యానం వింటూఉంటే. అసలు పొద్దున్నే ఈవిడ పక్కన కూర్చున్నందుకు నామీద నాకే జాలేసింది. కండక్టరుకి చెప్పి, నాసీటు మార్పించుకోవాలన్నంత కోపం వచ్చింది. కానీ, ఏమీ చెయ్యలేక, సభ్యత ముసుగులో నోరు మూసుకుని కూర్చున్నాను- 'మరో కొన్ని గంటలు ఎలా గడుస్తాయా భగవంతుడా' అనుకుంటూ.

"మీరెంతమంది అక్క చెల్లెళ్ళు అన్నదమ్ములు?" మరో ప్రశ్న.

"ఇద్దరు చెల్లెళ్ళు, ఒక అన్నయ్యా" విసుగ్గా చెప్పాను. కోర్టులో లాయరులాగా తను ప్రశ్నలడగడం, బోనులోని ముద్దాయిలా సమాధానం చెప్పడం కళ్ళనీళ్ళ పర్యంతం అయింది నాకు.

"హూం... ఆడ సంతానమే ఎక్కువన్నమాట. పాపం, మావారిని ఆఫీసులో ఒక గుమాస్తా ఉన్నాడు. అతనికి అయిదుగురు ఆడపిల్లలు. ఎవరో చెయ్యి చూసి ఆరో సంతానం మగపిల్లాడు పుడతాడని చెప్పారట. అందుకని మళ్ళీ ప్రయత్నం చేశారు, మళ్ళీ ఆడపిల్లేపుట్టింది, ఆరుగురు ఆడపిల్లలకి తండ్రయి కూర్చున్నాడు, ఇప్పుడు లబోదిబోమని మొత్తుకుంటాడు- ఏం లాభం? ఆరుగురికి పెళ్ళిళ్ళుచేసి పంపాలంటే మాటలా?" పకపకా నవ్వింది ఆదేదో పెద్ద జోక్‌లాగా, ఆ గుమాస్తాగురించి అంత హేళనగా. అతని బలహీనతని గురించి అంత తేలిగ్గా ఆమె మాట్లాడుతూంటే నాకు ఒళ్ళుమండింది. ఈసారి పుస్తకాన్ని పూర్తిగా మొహానికి అడ్డంగా పెట్టుకున్నాను- చదువుతూన్నట్టు నటిస్తూ.

"మా వారికి ఆడపిల్లలంటే ఎంతో ముద్దు మా సుధీర్ కడుపులో ఉన్నప్పుడు. ఆడపిల్ల పుడుతుందేమోనని గొలుసూ గాజులూ, ఉంగరాలూ ముందే చేయించి పెట్టారు. తీరా చూస్తే మగపిల్లాడు పుట్టాడు. అవన్నీ ఆ సన్యాసికే వేశాం, ముచ్చట పడుతూ".

నేను ఆవిడకేసి చూడకపోయినా, ఆమె నాకు వినపడేలా పెద్దగా మాట్లాడ్డం నాకు మరీ బాధనిపించింది. అయినా పుస్తకాన్ని మాత్రం అడ్డు తియ్యకుండా, అలాగే కూర్చున్నాను. టైమ్ పన్నెండయింది. విజయవాడ చేరడానికి మరో అరగంట పడుతుంది. ఈలోగా ఈవిడ ఎన్ని ప్రశ్నలు వేస్తుందో తలుచుకుంటే- గుండె దడదడలాడింది.

ఒక అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. ఆ నిశ్శబ్దానికి కారణం తెలీక, మెల్లిగా పుస్తకాన్ని కిందికి దించి చూశాను. ఆమె బాత్‌రూమ్‌లోంచి బయటికొస్తూ, నాకేసి చూసినవ్వింది. హడలిపోయాను. ఎందుకు చూశానా అని బాధపడుతూ.

"నీ కోసం స్టేషనుకి ఎవరైనా వస్తారా, నువ్వేపోతావా?"

"వస్తారు లెండి" తల వంచుకునే సమాధానం ఇచ్చాను.

"లేకపోతే చెప్పు, మా బంట్రోతు ఎలాగావస్తాడు స్టేషనుకి. నీకూ ఒక టాక్సీయో ఆటోనో తెచ్చి పెడతాడు. మావారికి టైముండదు రావడానికి పైగా ఈ గుమాస్తాగాళ్ళు సరిగ్గా పనిచేసి చావరుట. బాధ్యతంతా ఆఫీసరుదేనట, ఆఫీసరుగిరీ సామాన్యం కాదే అంటూ ఉంటారాయన" ఆవిడగారి మాటలన్నీ విన్నాక, ఆవిడగారి భర్తగారు ఏ ఆఫీసరో తెలుసుకోవాలన్న కుతూహలం నాలో మొదటిసారిగా కలిగింది.

"మీ ఆయన ఏం ఆఫీసరు?" నాకు నేనుగా ఆవిడతో మాట్లాడిన మొదటి మాట అది.

"రైల్వే కంట్రోలింగ్ ఆఫీసరు. అవును, మరిచేపోయా అడగటం మీనాన్నగారికేం పని?" వక్కపొడి నోటిలో వేసుకుంటూ అడిగింది.

"నాన్నగారు హైకోర్టులో జడ్జి, అన్నయ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఇంజనీరు, ఒక చెల్లి 'స్మితా' డాక్టరు. రెండోది 'మయూర' ఎల్.ఎల్.బి. పూర్తిచేసింది. నేను ఐ.ఎ.ఎస్. పాసయాను. విజయవాడలో కలెక్టరుగా ఉంటున్నాను" అన్నానుగుక్క తిప్పుకోకుండా. మళ్ళీ ఆవిడ మరో ప్రశ్న వెయ్యకుండా.

"ఏమిటీ? మీ నాన్న జడ్జియా? అన్నయ్య ఇంజనీరా? ఒక చెల్లి వకీలు, మరో చెల్లి డాక్టరూ, నువ్వు కలెక్టరివాలె?" ఆశ్చర్యంతో నోరు తెరిచింది. అంతే! షాక్ కొట్టిందేమో, తెరిచిన నోరు ఎంత సేపటికి మూత పడలేదు. విజయవాడ రానే వచ్చింది. నా స్టాఫంతా నా కోసం రావడంతో నేను గబగబా ట్రెయిన్ దిగిపోయాను. కానీ పాపం, ఆఫీసరుగారి భార్య మాత్రం ఇంకా షాక్‌నుండి తేరుకున్నట్లు లేదు, నాకేసి నోరు తెరుచుకుని చూస్తూ అలాగే కూర్చుండిపోయింది మతి పోయినదానిలా.